# ఐ పి టీ యం

"సుహాసిని లేచిపోయింది."

ఆయాసపడుతూ వగరుస్తూ చెప్పింది కళ. నా చెవులను నమ్మలేకపోయాను.

"ఛ! సుహా అలా చెయ్యదు."

కళ కళ్ళు కసితో భగ్గున మండాయి. నాలుగు అడుగుల ఎత్తున గుండ్రంగా ఉన్న ఆ శరీరం కోపంతో వణికిపోయింది.

"నమ్మరుకదూ! అవును. మీ కందరికీ సుహా దేవత. కాస్త ఎర్రగా బుర్రగా వుంది. నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడేసరికి దానంత మంచిది లేదనుకుంటారు. అది ఎలాంటి కొంపలుతీసే కోరివో నాకు మాత్రమే తెలుసు.

ఇప్పుడిలా లేచిపోయిందా? వాడు దీనితో ఏ నాలుగు రోజులో వుండి దీన్ని వదలేసి పోతాడు. దీని బ్రతుకు వీధిన పడుతుంది. చివరకు రోగాలతో ఏ ఆస్పత్రిలోనో దీని బ్రతుకు తెల్లవారుతుంది."

కచ్చగా మాట్లాడుతోన్న కళని విస్తుపోయి చూశాను. ఒకే రక్తం పంచుకుపుట్టిన చెల్లెల్ని అలా శాపనార్థాలు పెట్టగలుగుతోన్న ఆ మనసులో యెలాంటి అగ్నిగుండం రగులుతోందోనని భయం వేసింది.

"అమ్మ ఏడుస్తోంది. మిమ్మల్ని పిలుచుకు రమ్మంది. రండి." అంది కళ.

"నువ్వు వెళ్ళు. నేనిప్పుడే ఒక గంటలో వస్తాను." అన్నాను. కళ దొర్లుకుంటున్నట్టుగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. దూరాన్నుంచి ఆ మూర్తిని చూసి జాలిగా నిట్టూర్చాను.

కేశవరావుగారికి నేను మొదటినుంచీ ఫేమిలీ డాక్టర్ని ఆయనది మరీ సంపన్న కుటుంబం కాదుకాని లేని కుటుంబమూ కాదు. ఇంజనీర్ గా పని చేస్తున్నారు. ఆయన భార్య రాజ్యలక్ష్మికి మొదటి పురుడు నేనే పోశాను. ఏది అదృష్టమో ఏది దురదృష్టమో. మనకే తెలియదు. ఆనాడు పసిడి ఛాయలో చిరునవ్వులు చిందిస్తోన్న పాపను చూసి "రాజ్య

లక్ష్మిగారూ! మీరు చాలా అదృష్టవంతులండీ! బంగారు పాపను కన్నారు" అని అభినందించాను. కేశవరావుగారు ఎంతో మురిపెంతో తమ పాపకు 'కళ' అని పేరు పెట్టు కున్నారు. రాను రాను నేను ఆ కుటుంబానికి ఫేమిలీ డాక్టర్‌నే కాక ఫేమిలీ ఫ్రండ్‌నికూడా అయ్యాను. తరచు ఏదో వంకతో నన్నూ, మా శ్రీవారినీ రాజ్యలక్ష్మి దంప తులు భోజనానికి పిలిచేవారు. రాను రాను రాజ్యలక్ష్మికీ నాకూ స్నేహం బాగా పెరిగింది. రెండురోజుల కొకసారి అవిడైనా మా యింటికి వచ్చేది—నేనైనా వాళ్ళ యింటికి వెళ్ళేదాన్ని. నెలలు పెరిగినకొద్దీ కళ బాగా బొద్దుగా ఉంటే "హెల్దీ బేబీ" అనుకునేవాళ్ళం. కానీ, ఏడాది దాటినా కళ బాగా లావుగావుంటే నాకు ఏదో అనుమానం తోచింది కాని, నా అనుమానాన్ని బయట పెట్టలేకపోయాను. కళకు మూడోయేడు నడుస్తుండగా రాజ్యలక్ష్మికి సుహాసిని పుట్టింది. ఆ పిల్ల చాలా బలహీనంగా పుట్టిందికాని, మూడు నెలలకే బాగా కోలుకుని ముద్దుగా తయారయింది. కళకు పన్నెం డేళ్ళు వచ్చేసరికి నా అనుమానం నిజమయింది. ఆ అమ్మాయి అడ్డంగాతప్ప పొడుగ్గా ఎదగటంలేదు. రాజ్యలక్ష్మి గుండెల్లో రాయి పడింది. "ఆడపిల్ల దీని బ్రతుకేం కావాలి!" అని కుమిలి కుమిలి ఏడ్చింది. హార్మోన్స్ డిఫెక్టువల్ల కొందరి శరీరాలలో పెరుగుదల అలా ఆగిపోతుంది. దానికి యెవరూ ఏం చెయ్యలేరు. చెప్పలేక చెప్పలేక ఆ మాటే చెప్పాను. అయినా పాపం, కేశవరావుగారు ఊరుకోలేక ఎందరెందరో

స్పెషలిస్ట్‌లకి చూపించారు. అయినా ఏం ప్రయోజనం లేకపోయింది. ముఖం పచ్చగా కళకళలాడుతూనే వున్నా, పొట్టిగా, బాగా లావుగా గుండ్రంగా వుండటంవల్ల చాలా విడ్డూరంగా తయారయింది కళ— సుహాసిని ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా సన్నగా, నాజూకుగా బంగారు శలాకలాగా తయారయింది.

ఇంటికి వచ్చిన ఇరుగూ, పొరుగూ, అక్క చెల్లెళ్ళద్దరినీ పోల్చి ముఖంమీదే "అబ్బ! చెల్లెలు ఎంతో బాగుంటుంది— అక్క పాపం, అలా తయారయింది." అనేసేవారు.

అలా అనకూడదని యెవరికీ తోచేదికాదు. రాజ్యలక్ష్మి లోలోపల ఎంత మధనపడినా, ఏం చెయ్యలేకపోయేది. ఇలాంటి మాటలు వినివిని కళ మనసుకి ఒక అగ్నిజ్వాల రగలటం ప్రారంభమయింది. ఆ జ్వాలలో ప్రకృతి సహజమైన మమకారం మాడిపోయి చెల్లెలిమీద కసిమాత్రమే పేరుకోసాగింది కళ మనసులో......

షాపింగ్‌కి రమ్మంటే వచ్చేదికాదు. "ఎందుకూ? సుహాసిని పక్కన నన్ను చూసి అందరూ నవ్వటానికా? నా బతుక్కి ఏ చీరలయితేనేం? ఏదో ఒకటి తీసుకురండి." అనేది— తీరా చీరలుకొని తెచ్చిన తరువాత సుహాసిని సెలెక్ట్ చేసుకున్న చీరే, తనకు కావాలని పేచీ పెట్టేది. పాపం సుహాసినికూడా చిన్నపిల్లే కదా! తన చీర ఇవ్వననేది.

అవును నా మొఖానికి ఏ చీర అయితేనేం? అందాలరాశి సుహాకి మంచి మంచి చీరలుంటే చాలు!" అని రాగాలు తీసేది కళ. రాజ్యలక్ష్మి పడలేక సుహాసిని తనకోసం కొను క్కున చీర కళకి ఇప్పించేది. సుహాసిని కష్టపెట్టుకుని "నా కసలు కొత్తచీరే అక్కర్లేదు అన్నీ అక్కనే కట్టుకోమను. నీ చిరిగిన చీరలేమైనా ఉంటే, నా ముఖాన పారెయ్యి" అనేది అక్కసుగా. రాజ్యలక్ష్మి కళలేకుండా చూచి సుహా! మంచి దానివి కదూ! పాపం, అక్కస్థితి చూడు! దేవుడు దానికి అన్యాయం చేశాడు. మనంకూడా ఏడిపించవచ్చునా? నీకేం! ఏ చీరలోనయినా చక్కగా ఉంటావు. కొత్తచేర కట్టుకో తల్లీ!" అని బ్రతిమాలితే సుహాసిని మనసు సర్దుకుని కొత్త చీర కట్టుకునేది. సుహాసిని కళను ఎంత అభిమానంగా పలక రించబోయినా, కళ మనసు పొడుస్తున్నట్లుగా తప్ప మాట్లా డేది కాదు. ఈర్ష్యతో, కక్షతో మనసు యెప్పుడూ రగులుతూ ఉండటంవల్ల కాబోలు. కళ చదువులోకూడా అంత పైకి రాలేకపోయింది. మెట్రిక్ మూడుసార్లు ఫెయిల్ అయింది. ఇంటర్‌లోకి యెలాగో వచ్చి మళ్ళా ఇంటర్‌లోనూ మూడుసార్లు ఫెయిల్ అయింది. ఫలితంగా కళ ఇంకా బి. ఏ. లో ఉండగానే సుహాసిని యమ్. యస్‌సి. లో యూని వర్సిటీలో చేరింది. కళకి ఎంత మంటగాఉన్నా ఏం చెయ్య గలదు? రాజ్యలక్ష్మి మాత్రం "అక్కకి చదువబ్బలేదు గనుక నువ్వూ మానెయ్యి" అని చక్కగా చదువుకుంటున్న కూతురితో ఏం చెప్పగలదూ.

ఎప్పటికప్పుడూ రాజ్యలక్ష్మి నా దగ్గరకి వచ్చి కష్ట సుఖాలు చెప్పుకోవటంవల్ల నాకా ఇంటి సంగతులు యెప్పటి కప్పుడు తెలిసేవి.

సుహాసిని క్లాస్‌మేట్సంతా పిక్‌నిక్ ప్రోగ్రాం వేసు కున్నారు. సరిగ్గా సమయానికి కళ తయూ వస్తానంది. సుహాసిని తెల్లబోయింది. సాధారణంగా కళ సుహాసినితో కలిసి యెక్కడికీ వెళ్ళటానికి ఇష్టపడదు.

"రేపు సరిగ్గా ఎనిమిదిగంటలకల్లా కాలేజి నుంచి బస్ బయలుదేరుతుంది. మనం ఏడున్నరకల్లా ఇంటిదగ్గరనుంచి బయలుదేరాలి." అంది సుహాసిని.

సుహాసిని ఉత్సాహంగా ఏడుగంటలకల్లా తయా రయింది కానీ, కళ అప్పటికి స్నానానికికూడా లేవలేదు. కావాలని ఆలస్యంచేసి ఎనిమిదయినా తయారవలేదు. సుహా సిని కోపంగా "నాకు తెలుసు– నువ్వు కావాలనే ఆలస్యం చేస్తున్నావు. నేను పోతున్నా!" అంటే కళ బాత్‌రూంలోంచే "చూడమ్మా! నేను కూడా వస్తానంటోంటే సుహా ఆగకుండా వెళ్ళిపోతానంటోందీ! నేను తనతో వస్తే తనకి అవమానమసి కాబోలు!" అని గొడవ ప్రారంభించింది.

"ఏయ్ సుహా! కళ కూడా వస్తోంది ఆగు. ఎందుకు దాన్నలా వేధిస్తావు!" అని రాజ్యలక్ష్మి ఒక్క కసురు కసి రింది.

చూస్తూ వుండగా ఎనిమిదిన్నర అయిపోయింది. సుహాసిని కన్నీళ్ళు ఆపుకుంటూ తను కట్టుకున్న బట్టలు మార్చేసి ఒక పుస్తకం చేతిలోకి తీసుకుని కూచుంది. అది సంతృప్తిగా చూసి కళ చక్కగా తయారై "ఇక వెళ్దామా?" అంది. సుహాసిని సమాధానం చెప్పలేదు— పుస్తకంలోంచి తలకూడా ఎత్తలేదు.

"నాతో రావటం నీకు యిష్టంలేదా? ఆ మాట చెప్పవేం, మరి!" అని దీర్ఘాలుతీసి కళ కూడా తన బట్టలు మార్చేసి పక్కింటికి పెత్తనానికి బయలుదేరింది. చదువులో మనసు నిలపలేని కళకు పెత్తనాలంటే చాలా ఇష్టం.

కళ వెళ్ళిన కొద్ది సేపట్లోనే కేశవరావుగారి యింటి ముందు బస్ ఆగింది. అందులోంచి బిలబిలలాడుతూ విద్యార్థినీ విద్యార్థులు దిగి లోపలికి వచ్చేశారు.

"ఏయ్ సుహా! నీకు మతిపోయిందా? ఇంకా ఇలా కూచున్నావా? త్వరగా బయలుదేరు" అంది కసురుతున్నట్లు నళిని.

సుహాసిని సంభ్రమంగా "మీరు వెళ్ళిపోలేదా?" అంది.

"అదేమిటండీ! మీరు రాకుండా మేము యెలా

వెళ్తాం!" అదేదో అసంభవమైనంత ఆశ్చర్యపోతూ అన్నాడు గోపాలరావు.

"త్వరగా రా! చీర సింగారించుకో! బస్ కంట్రాక్టుకి మాటాడాం కనుక ఇలా తీసుకొచ్చాం! యింకా ఆలస్యం చేస్తే మర్యాద దక్కదు. నడు!" తొందర చేసింది అనూరాధ.

సుహాసిని గాలిలో తేలుకున్నట్లు తనగదిలోకి వెళ్ళి గబగబ చీర మార్చుకుని "అమ్మా నేను వెళ్తున్నాను." అని రాజ్యలక్ష్మితో చెప్పేసి స్నేహితులతో వెళ్ళిపోయింది.

ఇంటికివచ్చి ఈ విషయం తెలుసుకున్న కళ కడుపు మండిపోయింది.

"దీన్ని ఇంటికివచ్చి మరీ తీసుకుపోయారా? ఇది అక్కడ ఎన్ని వెధవవేషాలు వేస్తుందో!" అంది అక్కసుగా. కళ శారీరక స్థితినిబట్టి కళ విషయంలో చాలా సహనంగా ఉంటుంది రాజ్యలక్ష్మి. అయినా సుహాసినిమీద ఇలా లేని పోని అభాండాలు గుమ్మరిస్తోంటే— సహించలేకపోయింది.

"దానికోసం మగపిల్లలు మాత్రమే రాలేదే! ఆడ పిల్లలు, మొగపిల్లలు అందరూ కలిసి వచ్చారు. నవ్వుతూ నవ్విస్తూ అందరికీ తలలో నాలుకలా ఉంటుంది గనుక క్లాసందరికీ ఇదంటే ఇష్టమే!"

"ఆ! ఇష్టం— ఇది మార్కులకోసం ప్రొఫెసర్లని

మంచి చేసుకుంటుంది. కాబట్టి దీన్ని మిగిలిన వాళ్ళు మంచి చేసుకుంటున్నారు."

"కళా! అర్థం పర్థం లేకుండా మాట్లాడకు. మార్కుల కోసం ప్రొఫెసర్లని మంచి చేసుకోవలసిన కర్మ మన సుహాసకేం పట్టింది? ఏ నాడు ఏ పేపర్లోను దానికి అరవై కి తక్కువ రాలేదు. మొన్న సెమినార్‌లో అది చదివిన పేపర్ని ప్రొఫెసర్లంతా మెచ్చుకున్నారట! కాలేజి జర్నల్‌లో దీని ఆర్టికల్‌కి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. పరీక్షలు పాస్‌కాలేక ఒక్కొక్క క్లాస్‌లో రెండుమూడు గిరికీలు కొట్టేవాళ్ళు ఆ పాట్లన్నీ పడాలికాని, మనసుహాసకేం ఖర్మమే!"

"అను! అను! నేను ఫెయిలయ్యాననే కదూ, నన్నిలా దెప్పి పొడుస్తున్నావు!"

రాగం ప్రారంభించింది కళ.

"కర్మ! నేను నిన్నేం అన్నానే! నువ్వేదో అంటావు. దానికి సమాధానం చెపితే నిన్నేదో అన్నారని మీదపడతావు. చెప్పినదాన్ని అర్థం చేసుకోవటం, సవ్యంగా సమాధానం చెప్పటం నీకు చేతకాదా?"

తల కొట్టుకుంది రాజ్యలక్ష్మి.

రామారావు రాకతో పరిస్థితులు మరొక విచిత్రమైన

మలుపు తిరిగాయి. రామారావు ఎమ్. ఎస్. సి. చదువుతున్న బీదవిద్యార్థి. నా అనేవాళ్ళు లేనివాడు. కేశవరావు ఇంట్లో వారం కుదుర్చుకోవటానికి వచ్చాడు. కేశవరావు రామారావు మంచి చెడ్డలన్నీ విచారించి కులగోత్రాలుకూడా తెలుసుకుని "పోనీ మా ఇంట్లో ఉండి చదువుకో! మాతో పాటు తిందువుకాని. నీకు వీలయితే మా కళకి కాస్త చదువులో సాయంచెయ్యి. అది బి. ఏ. రెండుపార్లు తప్పింది" అన్నాడు. రామారావు మహాప్రసాదమని ఒప్పుకున్నాడు.

కళకి ఎలాగైన మంచి సంబంధం తెచ్చి చెయ్యాలని రాజ్యలక్ష్మి కేశవరావులు ప్రయత్నించి ప్రయత్నించి విసిగిపోయారు. నా అనేవాళ్ళులేక ఆర్థికంగా చితికిపోయివున్న రామారావును తాము ఆదుకుంటే అతడు కళను చేసుకుంటాడేమోననే ఆశ కలిగింది ఆ దంపతులకు.

రామారావు బీదవాడే కాని, స్ఫూరద్రూపి. ఆ కారణంచేత తల్లిదండ్రుల ఆలోచనవిన్న కళ మనసు రెక్కలు కట్టుకుని ఆకాశంలో విహరించసాగింది!

ఆ అమ్మాయి ముఖంలో నూతన వికాసంచూసి నాకు కొంతసంతృప్తి కలిగినా ఏదో అజ్ఞాతభయం నా మనసును కొద్దిగా కలవరపరచింది. రామారావు లాంటివ్యక్తి కళ లాంటి అమ్మాయిని స్వీకరిస్తాడని నమ్మటం కష్టమే మరి!

ఎం. ఎస్. సి. రిజల్ట్సు వచ్చాయి. సుహాసినీ, రామారావూ ఇద్దరూ ఫస్టుక్లాసులు తెచ్చుకున్నారు. రిజల్ట్సు వచ్చిన వారం రోజుల్లోనే సుహాసినీ రామారావులు ఇంట్లోంచి లేచిపోయారు.

పరువుగల కుటుంబాల్లో ఇలాంటి సంఘటన యెంత మనస్తాపాన్ని కలిగిస్తుందో ఊహించగలిగిన నేను రాజ్య లక్ష్మిని ఓదార్చటానికి వెళ్ళాను.

నన్ను చూడగానే "ఇంక కళగతి ఏం కావాలి డాక్టర్?" అని కుమిలి కుమిలి ఏడ్చింది రాజ్యలక్ష్మి. ఆమాతృ మూర్తి దుఃఖం చూడలేకపోయాను. అక్కడే నిలబడి ఎటో చూస్తోన్న కళని చూస్తోంటే కడుపు తరుక్కుపోయింది. "కళా! జరిగినదానికి బాధ పడకు......" అని నేనింకా ఏదో చెప్పబోతుండగానే కళ చివ్వున నా కైపు తిరిగింది.

"బాధా? నేనెందుకు బాధపడతాను? ఆ ముష్టి వెధవని నేను ప్రేమించాననుకున్నారా? నాకేం ఖర్మకాలింది? సుహాలాంటి వాళ్ళుపడాలి, వాడి వెంట? నాకు వాడంటేనే అసహ్యం......"

ఆశాభంగాన్ని కావేషంగా మార్చుకోవటం మంచి దేననిపించింది. కొంచెంసేపు కూచునివచ్చేశాను.

వారంరోజుల తర్వాత నాకు సుహాసిని దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

"ఆంటీ!"

నేను మీ కొక్కరికే ఉత్తరం వ్రాస్తున్నాను. మంచి చెడ్డల కర్థం తెలియని అప్పలమ్మలు నన్నెలా ఆడిపోసుకున్నా నాకేం బాధలేదు. మంచి మనసున్న మీరు మాత్రం నన్ను అర్థం చేసుకోగలిగితే చాలు—

రామారావు మా ఇంటికిరాకపూర్వమే నేనూ రామారావూ ప్రేమించుకున్నాము. నాన్నగారి సహాయం కోరమని రామారావును ప్రోత్సహించింది కూడా నేనే! కానీ, నాన్నగారు అక్కయ్యను రామారావుకిచ్చి చెయ్యాలనుకుంటారని ఊహించలేక పోయాను. పాపం, రామారావు కూడా ఈ పరిణామాన్ని ఊహించలేక పోయాడు.

"సుహా! పాపం, మీ అక్క ఎంతో ఆప్యాయంగా" మీకు అన్నం వడ్డిస్తాను రండి — అంటున్నప్పుడూ, "సినిమాకు వెళ్దామా" అని గారాబంగా అడిగినప్పుడూ, "అబ్బ! మీ మాటలు వింటూకూచుంటేచాలు, నాకు శరీరం పరవశిస్తుంది." అని తేలిపోయినప్పుడు, నాకు చాలా క్షోభగా ఉంది. ఏం చెయ్యాలో అర్థం కావటంలేదు. ఆ ముఖంలోకి చూస్తూ కటువుగా మాట్లాడి మనసు నొప్పించ

లేక పోతున్నాను. ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవటం ఒక్కటే చేయవలసిన పని" అన్నాడు.

కానీ, అందుకు నేను ఒప్పుకోలేదు. "ఎలాగో ఈ పరీక్షలు పూర్తి కానియ్యి. తరవాత ఏ బాధా ఉండదు." అని నచ్చజెప్పాను. నా మాట కాదనలేక పోయాడు రామారావు. పాపం పిచ్చి అక్కయ్య, ఆశలు పెంచుకుంది. ఆంటీ! ఇదే నేను చేసిన మహాపరాధం. కావాలని చెయ్యకపోయినా అక్క తన మనసులో రామారావుమీద ఆశలు పెంచుకోవటానికి పరోక్ష కారకురాలినయ్యాను. ఇందుకు మాత్రమే నేను గిల్టీగా ఫీలవుతున్నాను.

ఆంటీ! ఇంతవరకు అక్కకోసం, కుటుంబం కోసం, సంఘం కోసం, నేను ఎంతో ఎంతో సహించాను. నాకే మాత్రం నచ్చని చీరలు కట్టుకున్నాను. నా తప్పేమీ లేకపోయినా తిట్టి పోస్తోంటే సహించాను — అక్కకు పెళ్ళి కాకుండా నాకు పెళ్ళి చేసేస్తే అక్కకు అసలు పెళ్ళి కాదనే భయంతో, నన్ను చేసుకుంటామని వచ్చిన వాళ్ళనికూడా నాన్నగారు కాదంటోంటే నవ్వుకున్నాను. అక్క కారణంగా ఇంటి వాతావరణం నిప్పుల కుంపటై తిండికికూడా యింటికి రాకుండా యూనివర్శిటీలోనే గడపవలసివచ్చినా హాయిగానే గడిపాను.

కానీ, ఆంటీ! యిప్పుడు మాత్రం, నా ఆనందాన్ని

మరొకరికోసం త్యాగం చెయ్యలేను. నేను చేస్తున్న పని సంఘం దృష్టిలో అవినీతి అని నాకు తెలుసు. సంఘం దుమ్మెత్తిపోస్తుందనీ తెలుసు. అయినా ఆంటీ. జ్ఞానం వచ్చిన నప్పటి నుండీ, మరొకరి కోసమే బ్రతికి అలిసిపోయాను. ఇప్పుడైనా నా జీవితం నాకు కావాలి!

చిన్నప్పటినుండీ బలహీనంగా పుట్టానని నా కెన్నెన్నో మందులిచ్చావు. డాక్టర్ ఆంటీ! యింక నాకు నీ మందులతో అవసరంలేదు నీ మంచిమనసుతో ఆశీర్వదించు, "ఎదురుగాలులను ఎదుర్కొనే ఆత్మధైర్యం నాకు కలగాల"ని — నీ ఆశీర్వాదబలంతో నన్ను చూసి మొరిగే కుక్కల్ని చూసి నవ్వుకుంటాను — నాకు పెట్టే శాపనార్థాలను వరాలుగా మలచుకుంటాను.

ఉండనా, నీ సుహా......"

ఉత్తరం చదివి నిట్టూర్చాను. సుహాసిని చేసినది తప్పేనా? యీ సంఘానికి అణగిమణగి కుళ్ళిపోయిన మనసులతో, కృత్రిమపు చిరునవ్వులతో, కపటనాటకాలతో బ్రతికెయ్యగలిగితే "ఉత్తములు" అనే బిరుదు ప్రసాదిస్తుందేమో, యీ సంఘం? కానీ, జీవితానందాన్నే బలి చెయ్యవలసినంత గొప్పదా యీ బిరుదు? ఏమో! యీ మంచి చెడ్డలను బేరీజు వెయ్యగల ధర్మాధర్మ నిర్ణేతలెవరు?"

కొన్నాళ్ళ తరువాత ఒకరోజు కేశవరావుగారు కంగారుగా వచ్చి "కళకు ఫిట్స్ వస్తున్నాయి. మీరు వెంటనే రండి." అన్నారు. ఆలస్యం చెయ్యకుండా ఆయనతో వెళ్ళాను

కళ గుప్పిళ్ళు బిగించి విలవిల లాడుతోంది నేను పరీక్షించి ఇంజక్షన్ చేశాక కుదుట బడింది.

"ఈ క్రొత్త ఉపద్రవం ఏమిటి డాక్టర్!" అంది రాజ్యలక్ష్మి భయంగా.

"అంత భయపడవలసిందేం లేదు. ఇది హిస్టీరియాకు సంబంధించినది— పెళ్ళి చేస్తే తగ్గిపోతుంది." అన్నాడు.

"భగవంతుడా!" అని తల చేతులలో పట్టుకుంది రాజ్యలక్ష్మి.

కోలుకున్న తరువాత కళ జేలగా "నాకేమైంది డాక్టర్?" అంది.

దయనీయంగా ఉన్న ఆ ముఖంలోకి చూస్తూ ఏమని చెప్పగలను? దగ్గిరగా వెళ్ళి తల నిమరాను.

"ఐ పిటీ యు."

నా గుండెలు కరిగి పొంగిన ఆ పదాలు పెదవులు దాటి పైకి రాలేకపోయాయి.